హెల్మెట్ల పంపిణీ


మహిళలకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న మేయర్ విజయలక్ష్మి

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం తో పాటు వారి రక్షణ కోసం పాటుపడుతుందని నగర మేయర్ గద్వాల విజయలక్ష్మి అన్నారు. ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం కోఠిలో మహిళలకు హెల్మెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమం ఎంతో విజయవంతమవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గన్‌ఫౌండ్రీ మాజీ కార్పొరేటర్ మమతా సంతోష్ గుప్తా, ఖలీల్ అహ్మద్, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప మహా పడిపూజ


మహా పడిపూజలో మురళీస్వామి


పూజలో సిద్దు, అభినవ్ తదితరులు

లంగర్‌హౌస్: అయ్యప్ప మహా పడిపూజ వైభవంగా జరిగింది. రాందేవ్‌గూడలో వేదపండితులు రాజ నర్సింహాచారి ఆధ్వర్యంలో శకుంతల రామ్మోహన్, రాధిక మురళీమోహన్ దంపతులు అయ్యప్ప మహా పడిపూజ, పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ పూజల్లో ప్రముఖ సంఘసేవకులు రాజువస్తాద్, నందు, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోషామహల్‌లో..

అబిడ్స్: గోషామహల్‌లోని చంద్రశేఖర్ ఆజాద్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో అయ్యప్ప మహా పడిపూజ ఘనంగా నిర్వహించారు. స్వామియే శరణమయ్యప్ప అంటూ అయ్యప్ప స్వాముల భక్తి గీతాలు, భజనలతో మహా పడిపూజ కొనసాగించారు. ఈ వేడుకల్లో సిద్దు, అభినవ్, శ్రీకంద విజయ్, శైలేందర్, శ్రీధర్, రాజు, వినయ్, శ్యామ్, శ్రీనివాస్, అభినయ్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

వ్యాస డిజిటల్ కేంద్ర శిక్షణలు ప్రారంభం



జియాగూడ: విద్యార్థులకు డిజిటల్ కంప్యూటర్ శిక్షణలు ఎంతో అవసరమని బీజేపీ కార్వాన్ కాంటెస్టెడ్ ఎమ్మెల్యే అమర్‌సింగ్, వ్యాస డిజిటల్ కేంద్ర నిర్వాహకులు ప్రసాద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సబ్జిమండిలోని వీర అభిమాన్యు కల్చరల్ అసోసియేషన్ ద్వారా వ్యాస డిజిటల్ కంప్యూటర్ శిక్షణ కార్యక్రమం ప్రారంభోత్సవం జరిగింది. వ్యాస డిజిటల్ కేంద్ర, బీజేవైఎం నేషనల్ ట్రెజర్ అసాం స్టేట్ ఇన్‌చార్జి పీఎం.సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో వ్యాస డిజిటల్ కేంద్ర ట్రస్టు నిర్వహింపబడుతుంది. ఈ సంస్థ ద్వారా 5వ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న పిల్లలందరికీ వ్యాస డిజిటల్ కేంద్రం ద్వారా కంప్యూటర్ శిక్షణలు అందించడానికి ముందుకు వచ్చారు.

విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: విద్యుత్ అధికారులు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం హకీంపేట్‌లో విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ అధికారుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. విద్యుత్ వినియోగదారులు అధికారులు అందుబాటులో ఉండడం లేదని పలుమార్లు తనకు ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులు చేసే సమయంలో పనుల్లో జాప్యం చేయకుండా అధికారులు దగ్గరుండి పనులు పూర్తి చేయించాలని సూచించారు. కార్వాన్ నియోజకవర్గంలో ఎన్నో ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు ఓ వైపు ఒరిగి ఉన్నాయని వాటిని మార్చాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ అధికారులతో పాటు మజ్లిస్ నాయకులు హారూన్‌ఫరాన్, వజీఉజ్‌జమా, ఆలీముద్దీన్ తదితరులున్నారు.

12న హలో కళాకారుడా..చలో హైదరాబాద్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాకారుడు

సుల్తాన్‌బజార్: కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన కళాకారులను గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగాలు పెంచి ఆదుకోవాలని తెలంగాణ కళాకారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కళాకారులు కంటే సాయన్న, భూపల్లి అశోక్, గొర యాకన్న, మౌనిక్, సంపత్ తదితరులు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ నెల 12, 13 తేదీల్లో హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హలో కళాకారుడా–చలో హైదరాబాద్ పాటల పల్లకిలో 32 గంటల ఆటాపాట, దగా పడ్డా కళాకారుల డప్పుల మోత కార్యక్రమాన్ని కిశోర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, భట్టి విక్రమార్క, శ్రీధర్‌బాబు, సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, సాంస్కృతిక శాఖ చైర్మన్ వెన్నెల తదితర ప్రముఖులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు.

జీఎన్ఐటీఎస్‌లో 'ఫిట్ అండ్ ఫన్'


కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థినులు

గోల్కొండ: శరీరంతో పాటు మెదడు కూడా చైతన్యపరిచేందుకు ఎన్నో చిట్కాలు పాటించాల్సి ఉంటుందని ప్రొఫెసర్ డాక్టర్ రామలింగారెడ్డి అన్నారు. ఆదివారం షేక్‌పేట్‌లోని జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ అండ్ ఫిట్ ఇండియా క్లబ్ ట్రిత్రీ సౌజన్యంతో 'ఫిట్ అండ్ ఫన్' విత్ రిథమిక్ బ్రెయిన్ బ్రేక్స్ కార్యక్రమం నిర్వహించారు. ఫిట్ ఇండియా వారోత్సవాల సందర్భంగా ఆదివారం ముగింపు కార్యక్రమం జరిగింది. ఏకత్వ సహకారంతో ఏక్ భారత్ శ్రేష్ట భారత్, యోగా క్లబ్ వారు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ప్రొఫెసర్ రామలింగారెడ్డి మాట్లాడుతూ.. ఇటువంటి కార్యక్రమాలు అధ్యాపక బృందం, విద్యార్థినుల్లో నూతన ఉత్తేజాన్ని కలిగిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రమేష్‌రెడ్డి, స్టూడెంట్స్ ఎఫైర్స్ విభాగం డీన్ డాక్టర్ అపర్ణ పల్లే, డాక్టర్ ఎం.వి.ఎల్.సూర్య కుమారి తదితరులున్నారు.

దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి కృషి



సమావేశంలో బద్రీనాథ్ సింగ్, ఠాకూర్ గోపాల్ సింగ్, వీరేందర్ సింగ్

జియాగూడ: దత్తాత్రేయ ఆలయ అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఆలయ కమిటీ చైర్మన్ బద్రీనాథ్ సింగ్, కోశాధికారి ఠాకూర్ గోపాల్ సింగ్, వైస్ చైర్మన్ వీరేందర్ సింగ్ పేర్కొన్నారు. ఆలయాన్ని అంచెలంచెలుగా నూతన హంగులతో ఆధునీకరిస్తామన్నారు. దత్తాత్రేయ జయంతి వేడుకలతో పాటు ఇతర పండుగల సమయాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేసే విధంగా కృషి చేస్తామన్నారు. సీతారామ్‌బాగ్ పహాడ్‌పై ఉన్న చారిత్రాత్మకమైన దత్తాత్రేయ ఆలయానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బద్రీనాథ్ సింగ్, కోశాధికారిగా ఠాకూర్ గోపాల్ సింగ్, వైస్ చైర్మన్ వీరేందర్ సింగ్, సెక్రెటరీగా కృష్ణంరాజు, జాయింట్ సెక్రెటరీగా సందీప్ సింగ్, అసిస్టెంట్ ట్రెజరర్‌గా అన్ను శ్రీకాంత్ ఎంపికయ్యారు. ఎంపికైన నూతన కమిటీని ఘనంగా సత్కరించారు.



ఆకట్టుకుంటున్న మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్

ఫ్లై ఓవర్లకు నయా లుక్



టోలిచౌకీ ఫ్లై ఓవర్‌పై చిత్రాలు

నగరంలోని ఫ్లై ఓవర్ల సుందరీకరణలో భాగంగా మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్‌ను సుందరీకరిస్తున్నారు. ఫ్లై ఓవర్ ఇరువైపులా ఉన్న పిల్లర్లపై ఆకట్టుకునే చిత్రాలు, బొమ్మలు వేసే పని జోరుగా సాగుతుంది. పెయింటింగ్‌లో శిక్షణ పొందిన యువతీయువకుల బృందం ఫ్లై ఓవర్‌పై దృష్టిని ఇట్టే ఆకర్షించే బొమ్మలు వేస్తున్నారు. అలాగే నగరంలోని అతి పెద్ద లేబర్ అడ్డాల్లో ఒకటైన టోలిచౌకీ లేబర్ అడ్డా వద్ద గల ఫ్లై ఓవర్‌కు కూడా నూతన సొబగులు దిద్దుతున్నారు. ఫ్లై ఓవర్ పిల్లర్లపై బాలకార్మిక వ్యవస్థను వ్యతిరేకించే బొమ్మలు ఎంతో ఆకట్టుకుంటున్నాయి. పిల్లలు పుస్తకాలు పట్టుకోని ఉన్న ఓ చిత్రం చూపరులను ఇట్టే ఆకట్టుకుంటుంది. – గోల్కొండ


ఛత్రినాక చౌరస్తాలో పాలాభిషేకం చేస్తున్న నాయకులు


సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

పాలాభిషేకం

దూద్‌బౌలి: ఏడాది కాలంలో వేల కోట్ల రూపాయల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తూ రెండు లక్షల రుణమాఫీ చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. విజయోత్సవాలను పురస్కరించుకొని ఆదివారం దూద్‌బౌలిలో డివిజన్ అధ్యక్షుడు భానుచందర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచిపెట్టారు. నియోజకవర్గంలో ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. కేవలం ఏడాది కాలంలోనే 55 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నజీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రినాక చౌరస్తా వద్ద..

గౌలిపురా: ఛత్రినాక చౌరస్తా వద్ద ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ విజయోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి యాకుత్‌పురా అసెంబ్లీ ఏ-బ్లాక్ అధ్యక్షుడు మామిడాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు రాజు యాదవ్, సీనియర్ నాయకులు సుభాష్, మహిళా కాంగ్రెస్ నాయకురాలు నళిని గౌడ్, హైదరాబాద్ టీ టీ సెల్ జనరల్ సెక్రటరీ బండి సురేశ్ కుమార్ గౌడ్, యూత్ కాంగ్రెస్ నాయకులు శశి యాదవ్, హైదరాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ పవన్ కల్యాణ్ యాదవ్, యూత్ కాంగ్రెస్ యాకుత్‌పురా అధ్యక్షుడు సాయి యాదవ్, గౌలిపురా డివిజన్ అధ్యక్షులు రెడ్డి, కృష్ణ యాదవ్, మహ్మద్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

11న రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం

నాంపల్లి: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఈ నెల 11న ఉదయం 11 గంటలకు గృహకల్ప భవన సముదాయంలోని కేంద్ర సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరుగుతుందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండూరు గంగాధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నాంపల్లిలో ఆయన అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్‌తో కలిసి విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం జ్ఞానేశ్వర్ అధ్యక్షతన జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా సమావేశంలో పలు అంశాలపై చర్చించి తీర్మానాలను ఆమోదించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రధానంగా 2003లో ప్రభుత్వం నియమించిన వేతన సవరణ నివేదికను అనుసరించి ఉద్యోగులకు చెందాల్సిన ప్రయోజనాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం జరుగుతుందని తెలిపారు.

అట్టహాసంగా టీజీడీఏ తొలి జనరల్ కౌన్సిల్ సమావేశాలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ఏర్పడిన తర్వాత మొదటి రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశం కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ భవనంలో ఎంతో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాల అధ్యక్ష కార్యదర్శులకు రాష్ట్ర కమిటీ ఘనంగా సత్కరించింది. అనంతరం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ నరహరి, సెక్రెటరి జనరల్ డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ రావూఫ్ మాట్లాడారు. సంఘంలో ఉన్న కోర్టు కేసులు క్లీయర్ అయిన తర్వాత ఏర్పడిన తమ సంఘం ఎంతో చట్టబద్ధంగా కొనసాగుతుందన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు సిద్దిపేట రమేష్, డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ దీన్ దయాల్, డాక్టర్ కల్యాణ్, మురళీధర్‌రావు, కవి రమేష్, రాజశేఖర్, రవీందర్ పాల్గొన్నారు.

దారుషిఫాలో ప్రజా పాలన విజయోత్సవాలు


వెంకటేష్ మేరుకు కేక్ తినిపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపడుతున్న సంక్షేమ పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మొహమ్మద్ సమీర్ వలీవుల్లా అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాపాలన ప్రభుత్వానికి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా ఆదివారం దారుషిఫాబాల్ శెట్ మైదానం సమీపంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు మీర్జా అస్గర్ అలీ బేగ్, రాజ్జా అలీ మీర్జా ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలను అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ రియాజ్, హైదరాబాద్ డీసీసీ అధ్యక్షుడు సమీర్, చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇన్‌చార్జి కె.వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై పార్టీ పతకాన్ని ఆవిష్కరించి, కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నాట్య మయూర 7వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం కింగ్‌కోఠిలోని భారతీయ విద్యాభవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్యాచార్య ఎం.సౌందర్య కౌశిక్ శిష్య బృందం నాట్య ప్రవాహ పేరిట సంస్థ కళాకారులు వివిధ అంశాలపై చేసిన నృత్య ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా తెలుగు విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య వెలిదండ నిత్యానందరావు మాట్లాడుతూ..పాఠశాల స్థాయి నుంచే నేటి తరానికి శాస్త్రీయ కళలను నేర్పించాలన్నారు. జతిస్వరం, గరుడగమన, చక్కని తల్లికి, నీలమేగ సరేర, మంగళం వంటి అంశాలపై సాగిన నృత్యాలు వీక్షకులను సమ్మోహన పరిచాయి. ఈ కార్యక్రమంలో కేంద్ర సెన్సార్ బోర్డ్ రిజినల్ అధికారి షఫిల్ కుమార్, ఉస్మానియా యూనివర్సిటీ ఈఎంఆర్‌సీ డైరెక్టర్ రఘుపతి, ప్రముఖ నృత్య గురువు భాగవతుల సేతురామ్, కాంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత మద్దాలి ఉషా గాయత్రి, సంస్థ అధ్యక్షురాలు శ్రీరత్న, కార్యదర్శి కౌశిక్‌రామ్ తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన శ్యాంసుందర్ లోహియా



చార్మినార్: రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను పురానాపూల్‌కు చెందిన నటరాజ్ ఆయిల్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ శ్యాంసుందర్ లోహియా మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేసి సత్కరించారు. పాతబస్తీలో వ్యాపార అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై గవర్నర్‌తో చర్చించినట్లు శ్యాంసుందర్ లోహియా తెలిపారు.

మెహిదీపట్నంలో ప్రైవేట్ రైతుబజార్..?


మెహిదీపట్నం రైతుబజార్ గేటు ముందు వెలిసిన కూరగాయల స్టాల్స్

గోల్కొండ: మెహిదీపట్నంలో ఉన్న రైతు బజార్ నిర్వహణ ప్రభుత్వం గాలికి వదిలేసిందని పలువురు అంటున్నారు. మెహిదీపట్నం ప్రధాన బస్టాప్‌కు ఆనుకొని ఉన్న రైతు బజార్‌కు ఎస్టేట్ అధికారి ఉన్నారా అని పలువురు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. రైతుబజార్‌కు ప్రధాన రహదారిని ఆనుకొని రెండు గేట్లు ఉన్నాయి. అయితే ఈ రెండు గేట్ల ముందు లెక్కలేనన్ని కూరగాయల స్టాల్స్ ఉన్నాయి. మెయిన్ గేటుకు ఇరువైపులా ఉన్న రోడ్డు, ఫుట్‌పాత్‌లపై ప్రైవేటు వ్యక్తులు అన్ని రకాల కూరగాయలు, పండ్లు అమ్ముతున్నారు. అయితే ఈ విధంగా రైతు బజార్ ముందు కూరగాయలు అమ్ముతున్న వారిలో ఒక్కరు కూడా రైతు కాకపోవడం విశేషం. గుడిమల్కాపూర్ వెజిటేబుల్ మార్కెట్, ఇతర ప్రాంతాల నుంచి కొందరు వ్యాపారులు తెచ్చి ఇక్కడ అమ్ముతున్నారు. ఈ విధంగా రోడ్డు పక్కన వెలిసిన కూరగాయలు, పండ్ల స్టాల్స్ వల్ల ఉదయం నుంచి రాత్రి వరకు ట్రాఫిక్ జామ్ అవుతుంది. గత వారం టోలిచౌకీలో పోలీసులు ఫుట్‌పాత్ రోడ్డు ఆక్రమణను నిరోధించేందుకు రోప్ కార్యక్రమం నిర్వహించారు. అటువంటి కార్యక్రమం మెహిదీపట్నంలో కూడా నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆల్ ఇండియా దో ఫెడరేషన్ ఉప కోశాధికారిగా శ్రీ బాలాజీ



జియాగూడ: ఆల్ ఇండియా కరాటే దో ఫెడరేషన్ ఉప కోశాధికారిగా మల్తూంకార్ శ్రీబాలాజీ ఎన్నికయ్యారు. ఇటీవల ఢిల్లీలో ఏఐకేఎఫ్ జాతీయ ఎన్నికలు జరిగాయి. తెలంగాణ నుంచి ఉప కోశాధికారిగా ఎన్నికైన మల్తూంకార్ శ్రీ బాలాజీ 25 ఏళ్లుగా ఏఐకేఎఫ్‌లో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు. అలాగే ఈ ఎన్నికల్లో అధ్యక్షుడిగా రాజస్థాన్‌కు చెందిన రమేశ్వర్ నిర్వాన్, ప్రధాన కార్యదర్శిగా ఢిల్లీకి చెందిన రాజనీష్ కుమార్, పశ్చిమ బెంగాల్‌కు చెందిన తపన్ మిస్త్రీ , కోశాధికారిగా మధ్యప్రదేశ్‌కు చెందిన సురేంద్ర సింగ్, ఛత్తీస్‌ఘర్ నుంచి అజయ్ సాహు, కర్ణాటక నుంచి దత్తాత్రేయ రెడ్డి, మహారాష్ట్ర నుంచి సందీప్ సాలవిల్, ఉపాధ్యక్షులుగా, సహా కార్యదర్శిగా డమాన్ దేవ్, రమేష్ కుమార్ బత్రా, హిమాచల్ ప్రదేశ్ నుంచి బ్లజీత్ రంగడా, జమ్మూకాశ్మీర్ నుంచి ఉప కోశాధికారిగా సంజీవ్ దేవాన్, మణిపూర్ నుంచి ముతబీర్ హుస్సేన్, ఉప కోశాధికారిగా కేరళకు చెందిన ఆరునోదయం ఎన్నికయ్యారు.

పాతబస్తీలో బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలి


కవితను కలిసిన పంకజ్ షిండే

గౌలిపురా: లాల్‌దర్వాజాకు చెందిన బీఆర్ఎస్ యువ నాయకుడు పంకజ్ షిండే ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితను ఆదివారం కలిశారు. కవితను జూబ్లీహిల్స్‌లోని వారి నివాసంలో పంకజ్ షిండే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. పాతబస్తీలో బీఆర్ఎస్ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. పార్టీని తిరిగి అధికారంలోకి తేవడానికి శయశక్తులా కృషి చేస్తానని పంకజ్ షిండే అన్నారు.

మోత రోహిత్ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ



గన్‌ఫౌండ్రీ: ప్రజా ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తి చేసుకున్న సందర్భంగా యూత్ కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు మోత రోహిత్ ఆధ్వర్యంలో 1000 బైకులతో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాల మీదుగా తెలంగాణ రైజింగ్ అనే టైటిల్‌తో హైమాక్స్ వద్ద ఉన్న ఇందిరాగాంధీ విగ్రహం వద్ద ఈ ర్యాలీ ముగిసింది. ఈ సందర్భంగా మోత రోహిత్ మట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, ప్రజా శ్రేయస్సు కోసం నిరంతరం శ్రమిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి యువత తరపున కృతజ్ఞతలు తెలిపారు.

సమాజ సేవలో లయన్స్ భోజనాలయ ట్రస్ట్


అన్నదానం నిర్వహిస్తున్న ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు తదితరులు

అబిడ్స్: సమాజ సేవలో లయన్స్ భోజనాలయ చారిటబుల్ ట్రస్ట్ నిరంతరం సేవలందిస్తుందని బజరంగ్ సేనా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ వద్ద లయన్స్ భోజనాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. నిరంతరం సమాజ సేవ కోసం, పేద బడుగు వర్గాల సంక్షేమం కోసం లయన్స్ సంస్థలు చేస్తున్న సేవలు అమోఘమన్నారు. లయన్స్ క్లబ్ సంస్థల తరహాలో అందరు సమాజ శ్రేయస్సుకు, సమాజ ప్రగతికి సేవలందించాలని లక్ష్మణ్‌రావు పిలుపునిచ్చారు.

అన్నదానం



గోల్కొండ: నిరుపేద రోగులు, వారి సహాయకులకు 991 రోజులుగా అన్నదానం చేస్తున్నామని గోల్కొండ సెకండ్ లాన్సర్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ బషీర్ అన్నారు. ఆదివారం ఎంఎన్‌జే కేన్సర్ ఆసుపత్రితో పాటు పలు ప్రభుత్వ ఆసుపత్రుల వద్ద ఆయన నిరుపేద రోగులు, వారి సహాయకులకు భోజనంతో పాటు నీటి బాటిల్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను విద్యార్థి దశలో ఉన్నప్పుడు నిరుపేదల కష్టాలు చూసి చలించిపోయానన్నారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



జియాగూడ: ధూల్‌పేట మటన్ మార్కెట్, మంగళ్‌హాట్ ప్రాంతంలో ఓ ఇంట్లో గంజాయి అమ్మకాలు జరుగుతున్నాయి అనే సమాచారం మేరకు ఎస్ఎఫ్ టీమ్ ఆదివారం దాడులు నిర్వహించారు. ఇందులో రాజాసింగ్ అనే వ్యక్తి వద్ద 1.2 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అల్జాపూర్ ప్రాంతంలో రాహుల్ సింగ్ అనే వ్యక్తి వద్ద 2.1 కిలోల గంజాయిని పట్టుకున్నారు. ఈ రెండు కేసుల్లో రాజాసింగ్, సురేష్ సింగ్‌ను అరెస్ట్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్టీ ఎఫ్ టీమ్ లీడర్ అంజిరెడ్డి తెలిపారు. కాగా రాహుల్ సింగ్, మానస, విశాల్ సింగ్, రాహుల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్‌లను రికవరీ చేశారు. ఈ దాడిలో ధూల్‌పేట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ సీఐలు మధుబాబు, గోపాల్, ఎస్ఐలు ఐదులు, సిబ్బంది భాస్కర్, అజీమ్, శ్రీధర్, ప్రకాష్, రాకేష్, మహేష్ పాల్గొన్నారు.

రచయితలకు తెలంగాణ అస్తిత్వమే ముఖ్యం


మాట్లాడుతున్న కవి నందిని సిధారెడ్డి

గన్‌ఫౌండ్రీ: రచయితలకు తెలంగాణ అస్తిత్వమే ముఖ్యమని పలువురు వక్తలు అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో తెలంగాణ రచయితల సంఘం పదేళ్ల సాహిత్య సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అస్తిత్వ సాహిత్యం -వర్తమాన సందర్భం అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత వేణుగోపాల స్వామి మాట్లాడుతూ..ఉద్యమ కాలం నాటి తెలంగాణ సోయి రచయితలకు ఎల్లప్పుడు ఉండాలని సూచించారు. సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిధారెడ్డి మాట్లాడుతూ..కాకతీయ తోరణం, బతుకమ్మ, చార్మినార్ మొదలైన అస్తిత్వ చిహ్నాలు తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. అనంతరం రచయితల సంఘం తరపున ప్రచురించిన పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం, ప్రధాన కార్యదర్శి వి.శంకర్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సి.ఖాసీం, కవులు దాశరాజు రామారావు, కె.శ్రీరాములులతో పాటు పలువురు కవులు, రచయితలు తదితరులు పాల్గొన్నారు.